క్లుప్తంగా

నేటి నుంచి క్రమబద్ధీకరణ పట్టాల సవరణ

తగరపువలస: అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో 500 చదరపు గజాలలోపు ఆక్రమణలో ఉన్న నివాసాలకు ఇటీవల ప్రభుత్వం 388 జీవో ద్వారా జారీ చేసిన క్రమబద్ధీకరణ పట్టాలకు బుధవారం నుంచి సవరణలు చేయనున్నారు. 30 రోజుల వరకు ఈ సవరణలు చేయనున్నట్టు భీమిలి ఆర్డీవో పి.భాస్కరరెడ్డి తెలిపారు. పట్టాల రిజిస్ట్రేషన్, తప్పుల సవరణ, పేరు, ఆధార్ నంబర్, చిరునామా, ఫొటో, సర్వే నంబర్, డెత్ కేసులు, విస్తీర్ణం మార్పులకు మే 25 వరకు సంబంధిత సచివాలయాల ద్వారా సవరణలు చేయనున్నారు. జీవో నంబరు 388 ప్రకారం పట్టాలు పొందిన వారంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నిరంతరం వెలుగులే



పగలు వెలుగుతున్న లైట్లు

కొమ్మాది: పగలు రాత్రి అన్న తేడా లేదు. నిరంతరం ఆ విద్యుత్ దీపాలు వెలుగుతూనే ఉంటున్నాయి. జీవీఎంసీ 8వ వార్డు రుషికొండ నుంచి ఎండాడ వెళ్లే మార్గ మధ్యలో విద్యుత్ లైట్లు 24 గంటలూ వెలగడంపై పలువురు మండిపడుతున్నారు. దీని వల్ల విద్యుత్ వృథా అవుతుందని, లైట్లు త్వరగా పాడైపోతాయని అభిప్రాయపడుతున్నారు. కొన్నిచోట్ల లైట్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతుంటే ఇక్కడ ఇలా వెలగడం ఎంతవరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వృద్ధులకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆనందపురం: మండలంలోని గండిగుండంలో మంగళవారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ గండ్రెడ్డి శ్రీనివాస్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 60 ఏళ్లు పైబడిన సుమారు 30 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. రెటీనా సమస్య ఉన్న వారికి ఆస్పత్రిలో ఉచిత శస్త్ర చికిత్స చేయడానికి, అవసరమైన వారికి కళ్లద్దాలు ఉచితంగా అందించడానికి నిర్ణయించారు. కార్యక్రమంలో డాక్టర్ కామేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి మౌళాలి పాల్గొన్నారు.

ఘనంగా శంకర జయంతి



శృంగేరీ శంకర మఠంలో పూజలందుకున్న శంకరాచార్యులు

పీఎం పాలెం: జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలను పీఎం పాలెం బక్కన్న పాలెం రోడ్డులో ఉన్న శ్రీ శృంగేరీ శంకరమఠంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరాచార్యుల ఆలయంలో జగద్గురువు విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం అలంకరించిన శంకరాచార్యుల దర్శనం భక్తులకు కల్పించారు. కార్యక్రమంలో భాగంగా మఠం గౌరవ ధర్మాధికారి జగర్లపూడి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో హోమం నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

కొబ్బరిచెట్ల తొలగింపు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ దరి ఈనాడు లే అవుట్‌లో ప్రమాదకర స్థితిలో ఉన్న కొబ్బరి చెట్లను అధికారులు తొలగించారు. రోడ్డుకు అనుకుని ఉన్న ఈ చెట్లు ప్రమాదకర స్థితిలో ఉండటంతో స్థానికులు కార్పొరేటర్ లొడగల అప్పారావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంగళవారం సుమారు పది చెట్లను తొలగించినట్లు ఆయన తెలిపారు.

ప్రభుత్వానికి, ప్రజలకు వారధులు సర్పంచ్‌లు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



ఆనందపురం సర్పంచ్ లక్ష్మిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : స్వయం నిర్ణయం తీసుకునే అధికారం ఉన్న సర్పంచ్‌లు ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా పనిచేయాలని ముత్తంశెట్టి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్పంచ్‌లను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి పాలనను ప్రజల ముంగిటకే తెచ్చిందన్నారు. పంచాయతీ ప్రథమ పౌరుడిగా సర్పంచ్‌కు భారత రాజ్యాంగం విశేషమైన అధికారులు కట్టబెట్టిందన్నారు. ముఖ్యంగా ఏ ప్రజాప్రతినిధికీ లేని చెక్ పవర్‌ని సర్పంచ్‌లు పొందడం వల్ల స్వయం నిర్ణయాలు తీసుకోవడానికి ఎంతో వెసులుబాటు కలిగిందన్నారు. రాజ్యాంగానికి అనుగుణంగా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం దిశగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలన సాగుతోందని స్పష్టం చేశారు.

సొంత లాభం ఆశించకుండా ప్రజాసేవ చేస్తున్న ప్రజాప్రతినిధులలో సర్పంచ్‌లు ప్రథమ స్థానంలో ఉంటారని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలుపరుస్తూ నేరుగా అర్హులకే లబ్ధి అందిస్తున్న దృష్ట్యా ఆ కార్యక్రమాలు మరింత విజయవంతం కావడానికి సర్పంచ్‌లు అంకితభావంతో పనిచేయాలన్నారు. పథకాలలో అనర్హులకు చోటులేకుండా సర్పంచ్‌లు బాధ్యత తీసుకోవాలన్నారు. సర్పంచ్‌లు చిత్తశుద్ధితో పనిచేస్తే పంచాయతీలు సర్వతోముఖాభివృద్ధి సాధించడం కష్టం కాదన్నారు. పారిశుధ్యం, తాగునీరు, విద్య, వైద్య సేవలు ప్రజలకు సక్రమంగా అందేటట్టు సర్పంచ్‌లు బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పేదరికం లేని మెరుగైన జీవనోపాధి గల పంచాయతీగా గండిగుండం, సామాజిక భద్రత కలిగిన పంచాయతీగా చందక, స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాలు గల పంచాయతీగా శొంఠ్యాం, నీటి సమృద్ధి గల పంచాయతీగా పెద్దిపాలెం, పరిశుభ్రత గల పంచాయతీగా ఆనందపురం, పిల్లల స్నేహపూర్వక పంచాయతీగా కుసులువాడ, ఆరోగ్యకర పంచాయతీగా వెల్లంకి, మహిళా స్నేహ పూర్వక పంచాయతీగా గిడిజాల, సుపరిపాలన కలిగిన పంచాయతీగా తర్లువాడను ఎంపిక చేశారు. ఈ మేరకు ఆయా పంచాయతీల సర్పంచ్‌లను శాలువాలతో సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అడపా లవరాజు, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ వై.సూర్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, ఈవోపీఆర్డీ ఆంజనేయులు, సచివాలయాల కన్వీనర్ల మండల ఇన్‌చార్జి గండ్రెడ్డి శ్రీనివాస్, నాయకులు కాకర్లపూడి శ్రీకాంత్, బంటుబిల్లి మణిశంకర నాయుడు, పిన్నింటి వెంకటరమణ, బొట్టా రామకృష్ణ, కోరాడ అప్పలస్వామి నాయుడు, మరుపిళ్ల చిన్నయ్య పాత్రుడు, దోల దేవుడు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎల్లమాంబ టైలర్స్ సేవా సంఘం ప్రతినిధులు

తగరపువలస: తగరపువలస ఎల్లారమ్మ, కొత్తమ్మతల్లి, దుర్గాలమ్మకు పసుపు కుంకుమ సమర్పణ సందర్భంగా టైలర్స్, ఆటో, లైటింగ్ కార్మికులు మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఇటీవల ఏర్పడిన శ్రీ ఎల్లమాంబ టైలర్స్ సంక్షేమ సేవా సంఘం నూతన కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన రహదారి సమీపంలోని షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద మజ్జిగను పెంటపల్లి శ్రీను, చింతల సురేష్, నూలు గోవింద, సత్యనారాయణ, బల్లా శ్రీనివాసరావు, జోగ వెంకటరావు, జోగ అప్పారావు, కంఠిమహంతి మహేష్ పంపిణీ చేశారు. బైపాస్ రోడ్డులోని శ్రీషిర్డీ సాయిబాబా ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో, చిట్టివలసలో లైటింగ్ కార్మికులు మజ్జిగ పంపిణీ చేశారు.

పబ్లిక్ డిమాండ్

ఆర్‌జీకే కాలనీలో మురుగుతో అవస్థలు

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు మారికవలస జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ ఆర్‌జీకే కాలనీలో 92వ బ్లాక్ వెనుక మురుగు ప్రవాహం కోసం ఏర్పాటు చేసిన భారీ కాల్వలు నిండిపోవడంతో దుర్వాసన వస్తోంది. ఇక్కడ కనీసం మురుగునీరు కూడా ముందుకు కదలలేనంతగా చెత్తతో నిండిపోయాయి. పరిసరాలు చాలా అధ్వానంగా మారాయి. దుర్వాసన, ఈగలు, దోమలు, పందుల సంచారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కొందరు వ్యాధుల బారిన పడుతున్నారు. పారిశుధ్యం ఇంత అధ్వానంగా తయారైనా జీవీఎంసీ శానిటేషన్ విభాగం అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. పరిస్థితి మరింత విషమించక ముందే ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

– డి.శ్రీనివాసరెడ్డి, మారికవలస



మారికవలస ఆర్‌జీకే కాలనీ 92వ బ్లాక్ వెనుక నిండిపోయిన కాలువ

దోమల నివారణతోనే మలేరియాకు అడ్డుకట్ట



పద్మనాభంలో ర్యాలీ నిర్వహిస్తున్న సభ్యులు



ఇచ్ఛాపురం గ్రామంలో ర్యాలీలో ఆరోగ్య సిబ్బంది



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు

ఆనందపురం : నివాస ప్రాంతాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సామాజిక ఆరోగ్యాధికారి పి.సాంబమూర్తి సూచించారు. మండలంలోని కుసులువాడ పంచాయతీ ఇచ్ఛాపురంలో మంగళవారం మలేరియా వ్యాధిపై అవగాహన కలిగిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ నివాస ప్రాంతాల వద్ద, మురుగునీటి కాలువులు, మంచినీటి బోర్లు, కుళాయిలు వద్ద వాడుక నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయని చెప్పారు. తలుపులు, కిటికీలకు మెస్‌లను ఏర్పాటు చేసుకుంటే దోమలు ఇళ్లల్లోకి ప్రవేశించడానికి అవకాశం ఉండదని చెప్పారు. దోమలు కుట్టడం వల్ల మలేరియా వ్యాధి వ్యాపిస్తుందని వివరించారు. కుసులువాడ సచివాలయ సీహెచ్‌వో స్వర్ణలత, హెల్త్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, ఆరోగ్య కార్యకర్త దేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పద్మనాభం: మనం నివసించే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం వి.ప్రభాకర్ సూచించారు. మండల మహిళా సమాఖ్య భవనంలో మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల బారిన పడకుండా ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామ సంఘాల సభ్యులకు ఈ నెల 26న పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో పి.రాధ మాట్లాడుతూ దోమ కాటు వల్ల వచ్చే సీజనల్ వ్యాధుల నిర్మూలనకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంపీహెచ్ఈవో రాము మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని తెలిపారు. అనంతరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరుతూ పద్మనాభంలో ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

భీమునిపట్నం: మలేరియా వ్యాధి రాకుండా అందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తాళ్లవలస ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి డాక్టర్ శోభారాణి సూచించారు. మంగళవారం ఇక్కడి మండల వెలుగు కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పలు సూచనలు చేశారు. మలేరియాతో పాటు డెంగ్యూ, ఫైలేరియా సోకకుండా ఉండాలంటే ఇళ్ల వద్ద నీటి నిల్వలు లేకుండా చూసుకోవడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏపీఎం బి.రంగారావు, అధికారులు రాజకుమార్, సుశీల గ్రేసీ పాల్గొన్నారు.

మధురవాడ: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని మధురవాడ పీహెచ్‌సీ వైద్యులు ప్రశాంతి, దీపిక సూచించారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్లకార్డులు ప్రదర్శించి అవగాహన కల్పించారు.

తగరపువలస: ప్రపంచంలో ఎక్కువ శాతం మరణాలకు దోమలే కారణమని బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అప్పలరాజు అన్నారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కలిగించారు. ప్రపంచ వ్యాప్తంగా 106 దేశాల్లో 3.3 బిలియన్ల ప్రజలు మలేరియా బారిన పడుతున్నారన్నారు. 2007లో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏప్రిల్ 25న మలేరియా నివారణ దినోత్సవంగా ప్రకటించిందన్నారు. ఖాళీ కొబ్బరి బొండాలు, పాత టైర్లు, నిల్వ ఉన్న మురుగునీటిలో దోమలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, నాగమణి, మల్లిక తదితరులు పాల్గొన్నారు.



మధురవాడలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మహిళకు తప్పిన ప్రాణాపాయం



మహిళను వెలుపలకు తీస్తున్న స్థానికులు

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు మారికవలస ఆర్‌జీకే కాలనీలో ఓ మహిళ మంగళవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు బావిలో జారిపడింది. స్థానికులు తక్షణమే స్పందించడంతో ప్రమాదం తప్పి ప్రాణాలతో బయటపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ ఆర్‌జీకే కాలనీ 145వ బ్లాకు సమీపంలోని బావిలో రమ్య అనే మహిళ ప్రమాదవశాత్తు పడిపోయింది. పెద్ద శబ్దం రావడంతో స్థానికులు చూసి ఈత వచ్చిన వారు దూకి ఆమెని రక్షించారు. కుర్చీకి తాడు కట్టి సురక్షితంగా బయటకు తీశారు. ప్రాథమిక చికిత్స నిమిత్తం సమీపంలోని గాయత్రి ఆస్పత్రికి తరలించారు. ప్రాణాపాయం తప్పడంతో అందరూ సంతోషించారు. కళ్లు తిరగడంతో కాలు జారి పడిపోయినట్టు కుటుంబీకులు తెలిపారు.

వివక్ష లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు



గెద్దపేటలో తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



లబ్ధిదారుకు సంక్షేమ పథకాల మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

పద్మనాభం: రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎన్నికల గుర్తు ఫ్యాన్ తిరగాల్సిందేనని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కోరాడ పంచాయతీ గెద్దపేట, పడగలపేట గ్రామాల్లో మంగళవారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నాణ్యమైన విద్య, వైద్యం సామాన్య ప్రజలందరికీ అందుతున్నాయన్నారు. వివక్ష లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు తెలిపారు. గెద్దపేటకు జల జీవన్ మిషన్ కింద రూ.65 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో ఇంటింటికీ కుళాయిలు వేస్తారన్నారు. అనంతరం ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు ఇళ్ల గోడలకు అంటించారు. ఈ సందర్భంగా గెద్దపేటలో నాడు – నేడు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్, జీపీ నిధులు రూ.25.53 లక్షలతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల తరగతి గదులను ప్రారంభించారు.

అనంతుని ఆలయ అభివృద్ధికి రూ.60 లక్షలు

పద్మనాభంలోని అనంత పద్మనాభ స్వామి ఆలయ అభివృద్ధికి సీజీఎఫ్ నిధులు రూ.60 లక్షలు మంజూరైనట్టు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. వీటిలో రూ.12లక్షలు మ్యాచింగ్ గ్రాంటు తన కృషితో సింహాచలం దేవస్థానం ఇచ్చిందన్నారు. రూ.60 లక్షలతో అనంత పద్మనాభ స్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. అనంతుని కొండ ఘాట్ రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ రోడ్డు అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, తహసీల్దార్ తోట శ్రీవల్లి, ఇన్‌ఛార్జి ఎంపీడీవో పి.రాధ, వైఎస్సార్ సీపీ నాయకులు కోండ్రుతు శ్రీనివాసరావు, గెద్ద సూరినాయుడు, మామిడి శివరామకృష్ణ, బోని సన్యాసి నాయుడు, ఈర్ల ఈశ్వరరావు, సీర సూరప్పడు, అవనాపు బంగారునాయుడు, నల్లి సన్యాసప్పడు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



ధర్నాలో నినాదాలు చేస్తున్న ఏపీ జేఏసీ (అమరావతి) నాయకులు

మహారాణిపేట : కాంట్రాక్ట్ ఉద్యోగులు గత 20 సంవత్సరాలుగా రెగ్యులర్ కాకుండా ఉన్నారని ఏపీ ఉద్యోగ సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వర రెడ్డి అన్నారు.మంగళవారం సంఘాల కార్యాచరణ సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమీపంలోని ఎన్‌జీవో హోంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌జీవో సంఘం అధ్యక్షుడు కె.ఈశ్వర రావు, కార్యదర్శి రవిశంకర్, సిటీ కార్యదర్శి సత్యనారాయణ, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఏ త్రినాథరావు, అమరావతి కో చైర్మన్లు ఎ. శ్రీనివాసరావు, నమ్మి శ్రీనివాసరావు, కార్యదర్శి మహేష్, కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘం నాయకుడు వి. వీరబ్రహ్మం, కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.


తక్కువ ఖర్చుతోనే పౌష్టికాహారం



పౌష్టికాహార సదస్సులో మహిళలు

పీఎం పాలెం: తక్కువ ఖర్చుతోనే అధిక పోషకాలు ఉన్న ఆహారం తయారు చేసుకోవచ్చని వాసవ్యా మహిళా మండలి కమ్యూనిటీ కో ఆర్డినేటర్ ప్రసన్న లక్ష్మి సూచించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో స్త్రీల ఆరోగ్యం – తీసుకోవాల్సిన పౌష్టికాహారం అంశంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కుషాల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మరో కో ఆర్డినేటర్ రమ్య మాట్లాడుతూ చౌకగా లభించే రాగిపిండితో రుచికరమైన ఆహారం తయారు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త సంతోషి, ఏఎన్ఎం భవానీ, మహిళా పోలీసు దివ్య, బాలింతలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గడపలోనూ సీఎం జగన్‌కు ఆదరణ



మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, నాయకులు

కొమ్మాది: ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ప్రతీ గడపలోనూ సొంత బిడ్డలా ఆదరిస్తున్నారని కార్పొరేటర్ లొడగల అప్పారావు అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో గల 87వ నంబరు సచివాలయంలో 900 గృహాల పరిధిలో జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం మంగళవారం నాటికి సంపూర్ణంగా పూర్తయ్యిందని తెలిపారు. ఏ గడపకు వెళ్లినా సంక్షేమ పథకాలతో సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. పూర్తయిన పుస్తకాలను జేసీఎస్ కో ఆర్డినేటర్ ఉప్పులూరి గోపికి అందజేశారు. పవన్, సీరపు వంశీకృష్ణ పాల్గొన్నారు.

గురుకుల బాలికలకు భవనం సిద్ధం



బాలికల కోసం నిర్మించిన భవనం

భీమునిపట్నం: భీమిలిలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో కొత్త అదనపు భవనం నిర్మాణం పూర్తి కావస్తుండడంతో త్వరలో అందుబాటులోకి రానుంది. ఇందులో 5 నుంచి 10వ తరగతి వరకు ఉండగా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 430 మంది బాలికలు చదువుతున్నారు. ప్రస్తుతం వీరు ఉంటున్న హాస్టల్ భవనం పాతది కావడంతోపాటు అందరికీ సరిపోకపోవడంతో ఇబ్బందికరంగా ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నూతన భవన నిర్మాణానికి రూ. 2.80 కోట్లు కేటాయించింది. ఇక్కడ విశాలమైన ప్రాంగణం ఉండడంతో అన్ని సదుపాయాలతో కూడిన భవన నిర్మాణం మూడు సంవత్సరాల క్రితం ప్రారంభమైంది. నిర్మాణం పూర్తికావస్తుండడంతో త్వరలో ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు.

అమ్మవార్లకు పసుపు కుంకుమ సమర్పణ

తగరపువలస: తగరపువలస ఎల్లారమ్మ, బంగ్లామెట్ట దుర్గాలమ్మ, కొత్తపేట కొత్తమ్మవార్లకు ఇక్కడి ప్రజలు భక్తిశ్రద్ధలతో మంగళవారం పసుపు కుంకుమ సమర్పించారు. ఉదయం నుంచే ఆలయాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. అమ్మవార్లను పూజారులు గాంధీబొమ్మ చదురు నుంచి ఆలయాలకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బాణసంచా, కాంతారా డ్యాన్స్, అమ్మవార్లు, పులివేషాలు, కోలాటం, తీన్‌మార్‌తో ఆలయ పరిసరాలు మార్మోగాయి.

వైభవంగా రామానుజ జయంతి వేడుకలు

కొమ్మాది: స్థానిక కొమ్మాది అన్నంరాజునగర్‌లో గల శ్రీ అష్టలక్ష్మి ఆలయంలోని శ్రీ భగవత్ రామానుజాచార్యుల జయంతి ఉత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా పూలతో రామానుజ స్వామిని అలంకరించి అష్టోత్తర పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి పాల్గొన్నారు.



పూజలందుకున్న రామానుజాచార్యులు

సేంద్రియ పద్ధతిలో కూరగాయల సాగు

తగరపువలస: భీమిలి కేథరిన్ పబ్లిక్ స్కూల్ 8వ తరగతి విద్యార్థులు ప్రకృతి సాగులో పండించిన కూరగాయలను మంగళవారం వేలం వేయగా 9వ తరగతి విద్యార్థులు రూ.2300లకు సొంతం చేసుకుని ప్రోత్సహించారు. పాఠ్యాంశాల బోధనలో భాగంగా స్కూల్ బయాలజీ ఉపాధ్యాయురాలు అమిత సేంద్రియ వ్యవసాయం ప్రయోజనాలను వివరించారు. పలురకాల ఆకుకూరలు, కూరగాయలు విద్యార్థులతో సాగు చేయించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఆలీవర్ ఆర్ రాయి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచం మొత్తం ఆరోగ్య సంరక్షణలో భాగంగా సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపుతుందన్నారు. తమ విద్యార్థులు కూడా ఆ మార్గాన్ని ఎంచుకోవడం శుభ పరిణామమన్నారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ ఇవాంజిలిన్ రాయి, ప్రధానోపాధ్యాయురాలు సౌజన్య అభినందించారు.